క్లుప్తంగా

ఫ్యాక్టరీ ప్రమాద బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపురం: సగ్గొండ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీలో శనివారం జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులను వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, ఎంపీటీసీ సభ్యుడు మేడ్ని రామచంద్రం, వార్డు సభ్యుడు ఉక్కుసూరి సురేష్ ఆదివారం పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన మల్లిపూడి రాజ్‌కుమార్, గంగుల రాజేష్, ఎం.శ్రీనివాస్‌లకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, కార్మికులకు బీమా చేయించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారేనని, వారికి యాజమాన్యం న్యాయం చేయాలని, లేకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని వేణు హెచ్చరించారు.

నేడు గోలింగేశ్వరస్వామి దివ్య కల్యాణం

నిడదవోలు: పట్టణంలో వేంచేసియున్న గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27న సాయంత్రం 7 గంటలకు రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ నామా సూర్యప్రకాశరావు ఆదివారం తెలిపారు. అమ్మవారికి కుంకుమపూజలు, స్వామివారి రుద్రాభిషేకాలు జరుగుతాయని ఆయన చెప్పారు.

ముగిసిన ఈదమ్మతల్లి ఉత్సవాలు

చాగల్లు: గ్రామంలోని రజకుల ఇలవేల్పు ఈదమ్మతల్లి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు నాలుగు రోజులు పాటు వైభవంగా జరిగాయి. చివరిరోజు అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణ

నిడదవోలు: పట్టణంలోని బాలాజీనగర్‌లోని కందకట్ల శ్రీనివాస్‌ప్రసాద్ నివాసంలో రామదూత హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శి గోవర్ధనం శ్రీనివాస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు, హనుమాన్ పూజలు, అభిషేకాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కందకట్ల శ్రీనివాస్, గమిని వెంకటరత్నం, వలిచేటి వెంకట సుబ్బారావు, ఆకుల సత్యనారాయణ, ఉప్పల పద్మశ్రీ, బంటి సత్యనారాయణ, వేదుల జనార్దనరావు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

ఉండ్రాజవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని మండల మానవత అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అన్నారు. మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం మండలంలో పాలంగిలోని మానవత సంస్థ భవనంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో వైద్య ఖర్చుల నిమిత్తం టి.నాగమణి, కుడిపూడి రామాంజనేయులకు రూ.5 వేలు చొప్పున ఇద్దరికి ఆర్థికసాయం (చెక్కులు) అందజేశారు. కార్యక్రమంలో తాతిన వెంకట కృష్ణారావు, వేలిచేటి బోస్, మండల కార్యదర్శి ఫణితిని పార్వతి, కోడూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నిడదవోలు రూరల్: పదో తరగతి పరీక్షలంటే భయం వీడి ఉత్తమ ఫలితాలు సాధించాలని అరుంధతీయ టీచర్స్ ప్రతినిధి బొలిపో మధు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం అరుంధతీపేటలోని పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల అసోసియేషన్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆదివారం అందజేశారు. విద్యార్థులంతా మంచి కోర్సులు ఎంపిక చేసుకుని కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు ముప్పిడి విజయకుమార్, జొన్నకూటి శేషు, మెరిపే సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నల్లజర్ల: అనంతపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో వెలగాని దుర్గారావు ఇల్లు ఆహుతైంది. బాధిత కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ గౌడ సేవా సమితి ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసింది. సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లం అప్పన్న, గౌరవాధ్యక్షుడు వీరమళ్ల వెంకటేశ్వరావు (పండు) ఈ విషయం తెలిపారు. సమితి అధ్యక్షులు బొమ్మగాని బాలకృష్ణ, మరగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ బైగాని రంగారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

- స్వయంభువుగా వేంచేసిన కపిల మల్లేశ్వరస్వామి
- ఈ నెల 26న శివరాత్రి పర్వదినం


మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వరస్వామి ఆలయం


కపిల మల్లేశ్వరస్వామి (శివలింగం)

పెరవలి: వశిష్ఠ గోదావరీ తీరాన మల్లేశ్వరంలో స్వయంభువుగా వేంచేసిన కపిల మల్లేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి మహోత్సవాలకు ఆలయాన్ని సుందరంగా అలకరించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవాలయం ఒక విశిష్టత సంతరించుకుంది. ఈ శివాలయంలో ఉన్న శివలింగం నిత్యం జలాధివాస దీక్షలో ఉంటుంది. ఇలా నీళ్లలో శివలింగం మునిగి ఉండటం రాష్ట్రంలో ఎక్కడా లేకపోవడంతో ఈ దేవాలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలసిల్లుతున్నది.

ఆలయ చరిత్ర

పూర్వం ఈ ప్రాంతమంతా దట్టమైన అడవి ఉండేది. సంచార జాతుల వారు ఈ ప్రాంతంలో గోవులను మేపుకుని కాలం వెళ్లదీసేవారు. గోవుల మందలో కపిల అనే గోవు మంద నుంచి విడిపోయి అడవిలో ఓ పుట్ట దగ్గరికి వెళ్లి ప్రతిరోజూ పాలు ఇచ్చేది. పుట్ట దగ్గర పాలు ఇచ్చిన తరువాత ఎప్పటిలా మందలో కలసిపోయి వచ్చేది. మకాంకు వచ్చిన తరువాత పాలు పితుకుతుంటే ఏమీ రాకపోవడంతో యజమాని కాపరులను తిడుతూ ఉండేవాడు. ఒకరోజు కాపరి మంద నుంచి వెళ్తున్న ఆవును గమనించాడు. అనుమానం వచ్చి గోవు వెనకాల వెళ్లి చూడగా పుట్టపై నుంచి పాలు ఇవ్వడం చూసి ఆశ్చర్యం చెందాడు. పుట్ట దగ్గర పాలు ఇస్తున్న విషయాన్ని యజమానికి తెలపడంతో గ్రామస్తులను తీసుకువచ్చి ఆవు చేస్తున్న పనిని వివరించి పుట్టను చూపించాడు. గ్రామస్తులందరూ పుట్టను తవ్వగా ఒక శివలింగం బయటపడింది. ఆ లింగాన్ని తీయడానికి గ్రామస్తులంతా ఎంత ప్రయత్నించినా కదలకపోవడంతో వేదపండితులు అక్కడే ఆలయ నిర్మించారని చెబుతారు. ఈ ఆలయ నిర్మాణం 11వ శతాబ్దంలో రెడ్డి రాజుల పరిపాలనలో జరిగిందని చరిత్ర చెబుతుంది. కపిల అనే గోవు వలన ఈ ఆలయం నిర్మించారు కాబట్టి ఆ స్వామికి కపిల మల్లేశ్వరుడిగా నామకరణం చేశారు. ఈ ఆలయంలో ఒక విశిష్టత కూడా ఉంది. వశిష్ఠ గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా గర్భగుడి మొత్తం నీటితో నిండిపోతుంది. ఆ నీరు ఎలా వస్తుందో ఎలా వెళ్తుందో కూడా ఈ నాటికి అంతుపట్టని విషయమే. గర్భగుడి మునిగిపోయినప్పుడు స్వామివారికి నిత్యపూజలను తెప్పలో వెళ్లిఅర్చకులు చేసి వస్తూ ఉంటారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు భక్తులు ప్రతీరోజూ తండోపతండాలుగా వచ్చి స్వామివారిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడం జరుగుతుంది. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. దూరప్రాంత భక్తుల కోసం భోజన వసతి కల్పించామని మధ్యాహ్నం నుంచి రథోత్సవం జరుగుతుందని అన్నారు.

చురుగ్గా ఏర్పాట్లు


బ్రాహ్మణగూడెంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

చాగల్లు: మహాశివరాత్రి ఉత్సవాలకు మండల పరిధిలోని గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. పలు శివాలయాల వద్ద ఆదివారం చలువ పందిళ్లు వేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాలకు కొత్త రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. చాగల్లు రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి 7 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం లింగోద్భవ కాలం వరకు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దీపాలంకరణ సేవ, లక్షపత్రిపూజ, సహస్రజ్యోతిర్లింగార్చన కార్యక్రమాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. బ్రాహ్మణగూడెం బాలరామ లింగేశ్వరస్వామి ఆలయం, కలవలపల్లి శివాలయం, మార్కొండపాడు ఉమామార్కండేయ స్వామి ఆలయం, నందిగంపాడు శివాలయం, చిక్కాల శివాలయంలో భారీ ఏర్పాట్లు చేశారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

బ్రాహ్మణగూడెం తదితర గ్రామాల్లో శివాలయాల్లో ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


దేవరపల్లిలోని ఉమా రామలింగేశ్వర స్వామి వారు

మహా ఉత్సవాలకు సర్వం సిద్ధం


గౌరీపట్నంలోని గౌరీ సమేత మహాలింగేశ్వర స్వామి వారి ఆలయం

దేవరపల్లి: మహా శివరాత్రి మహోత్సవాలకు మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యాన ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం కావడంతో సోమవారం నుంచే ఆలయాల వద్ద ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నాడు. గౌరీపట్నంలోని గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి వారి ఆలయాన్ని ఇటీవల సుమారు రూ.7 కోట్లతో పునర్మించి, జీవ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు రానున్నారు. దేవరపల్లిలోని పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయాన్ని కూడా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. సోమవారం రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న రుద్రహోమం నిర్వహిస్తారు. 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 3 గంటలకు స్వామి వారికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. మండలంలోని దుద్దుకూరు, బందపురం, కురుకూరు, పల్లంట్ల, త్యాజంపూడి, యర్నగూడెం, సంగాయగూడెం, కృష్ణంపాలెం, యాదవోలు, చిన్నాయగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో కూడా మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన


దొమ్మేరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఢిల్లీరావు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామంలో రైతు నీరుకొండ సత్యనారాయణకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం సందర్శించారు. వివిధ పంటలకు రైతు అనుసరిస్తున్న సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గోమూత్రంతో తయారు చేసే జీవామృతం, పశువుల పెంట, వర్మి కంపోస్టు ఎరువు తయారీ విధానాలను గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. అరటి, బొప్పాయి, నువ్వులు, మొక్కజొన్న, చెరకు పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్ తాతారావు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ పి.సుజాతకుమారి, మండల వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

దేవరపల్లి: గౌరీపట్నంలోని నిర్మగిరి మేరీ మాత పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదాన కేంద్రం వద్ద భక్తుల కోసం మరిన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ తెలిపారు. అన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ప్లాంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్‌పీటర్ మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో ప్రతి రోజూ అన్నదానం చేస్తున్నామన్నారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం చేస్తున్నట్టు ఆయన వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు చల్లని మంచినీరు అందించడానికి కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. అన్నదాన ట్రస్ట్ నిర్వాహకులు కళ్లే నాగేశ్వరరావు మాట్లాడుతూ తన భార్య లలిత జ్ఞాపకార్థం కూలింగ్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. తన భార్య లలిత పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఫాదర్ జాన్‌పీటర్‌ను నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దిరిసిన ఫాతిమా రాణి, శ్యామ్, శివ, అనిల్, అజయ్, సిస్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- ఇళ్లలో తడి, పొడి చెత్త సేకరణ
- సంపద తయారీ కేంద్రాలకు రోడ్ల పక్క చెత్త తరలింపు
- రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్


దేవరపల్లిలో రోడ్డు పక్కన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు


దేవరపల్లి మండలం దుద్దుకూరులో తడి, పొడి చెత్తను సేకరిస్తున్న కార్మికులు

దేవరపల్లి: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు దేవరపల్లి మండలంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి గ్రామాల్లోని ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. సందప తయారీ కేంద్రాలను వర్మీ కంపోస్టు తయారీకి సిద్ధం చేస్తున్నారు. దాదాపు ఎనిమిది ఏళ్ల క్రితం గ్రామాల్లో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు నిరూపయోగంగా పడి ఉన్నాయి. కేంద్రాలను మరలా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. దీంతో గ్రామాల్లో ఇంటింట తడి,పొడి చెత్త సేకరణ చేస్తున్నారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. రోడ్ల పక్కన గల చెత్తను డపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. దేవరపల్లిలో తడి,పొడి చెత్త సేకరణ గురించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తడి, పొడి చెత్త వేసుకోవడానికి గ్రామ పంచాయతీ ద్వారా ఉచితంగా ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్‌లను అందజేస్తున్నట్టు సర్పంచ్ కడిమి వీరకుమారి, పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ తెలిపారు. పారిశుద్ధ్య పనులను సర్పంచ్ వీరకుమారి, కార్యిదర్శి రవికిషోర్ పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, ఎస్సీ, బీసీ ఏరియాల్లో శానిటేషన్ పనులు చేస్తున్నట్టు రవికిషోర్ తెలిపారు. మండల పంచాయతీల విస్తరణాధికారి రాజారావు సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణతో పర్యావరణానికి మేలు

నిడదవోలు రూరల్: వ్యర్థాల నిర్వహణ వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్వహణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెంలో తడి–పొడి సేకరణపై ఆదివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటిలో, ఇంటి పరిసరాల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా చేయకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. డి.ముప్పవరం, మునిపల్లి గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలంగిలో..

ఉండ్రాజవరం: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పంచాయితీ సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి సూచించారు. పారిశుద్ధ్యపై రెండో రోజు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం మండలంలో పాలంగి, మోర్త గ్రామాలను ఆమె సందర్శించి, అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యదర్శులకు, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో అమ్మాజీ, ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, సర్పంచ్‌లు బొక్క శ్రీనివాసు, చిటికెన సుజని, కార్యదర్శులు హసన్ జానీ, బాలాత్రిపుర సుందరి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

230 మందికి వైద్య పరీక్షలు

గోపాలపురం: మండలంలోని గంగోలు పంచాయతీ పరిధి హుకుంపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం పల్స్, కొయ్యలగూడెం ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో జయవరపు వెంకటరత్నం, అప్పాయమ్మల జ్ఞాపకార్థం వైద్య శిబిరం నిర్వహించినట్లు జమీందార్లు హోతా సీతారామశాస్త్రి, వీరభద్రరావు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు కొల్లూరి లక్ష్మణ్, భాగ్యలక్ష్మి, చక్రపాణి, నాగార్జున, వైద్య సిబ్బంది సేవలు అందించారు.

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసిన కోటసత్తెమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.93,839 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడిగా కృష్ణారావు

చాగల్లు: కొవ్వూరు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడిగా చాగల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బొర్రా కృష్ణారావు నియమితులయ్యారు. రాజమహేంద్రవరంలో ఆదివారం రాష్ట్రస్థాయి గౌడ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో కొవ్వూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా కృష్ణారావును నియమించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఈ అవకాశం కల్పించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామ్‌గోపాల్, జిల్లా అధ్యక్షుడు తాతా కృష్ణారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటంతో హక్కులు సాధించుకోవాలి


ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పాటిల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా నాయకులు

పెరవలి: బడుగు, బలహీన వర్గాల వారు ఐక్యమత్యంతో తమ హక్కులను పోరాటం ద్వారా సాధించుకోవాలని, అంబేడ్కర్ ఆశయాలకు, ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జీఎస్ పాటిల్ తెలిపారు. మండల కేంద్రమైన పెరవలిలో ఉభయగోదావరి జిల్లాల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి ఆయనతో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కావాలంటే పోరాటం ఒక్కటే మార్గమని అందుకు అనుగుణంగా ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఏవీ కిరణ్, ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ కార్యదర్శి నీతిపూడి వెంకట్రావు, నిడదవోలు డివిజన్ అధ్యక్షుడు సుబ్బారావు, ఏఈ నిశ్చల్, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు బి.నరేంద్ర శ్రీనివాస్, నాని, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాల నెమరువేత!

45 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


45 ఏళ్ల తర్వాత కలుసుకున్న అనంతపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు


తాడిపర్రు ఉన్నత పాఠశాలలో 2012-13 బ్యాచ్ విద్యార్థులు

నల్లజర్ల: 'హలో నువ్వు పద్మవాణివే కదా..అవును..బాగానే గుర్తు పట్టాను'.. అంటూ ఓ నేస్తం సంభ్రమాశ్చర్యం! 'అరేయ్ సుబ్రహ్మణ్యం నువ్వు బాగా మారిపోయేవురా'..అంటూ కళ్లింత చేసుకొని మరో స్నేహితుడి కామెంట్. 'సర్వేసు కనీసం అప్పుడప్పుడైనా పలకరించొచ్చుకదరా'.. అంటూ ఇంకొకరి నిష్టూరం. 'ఒరేయ్ రావూరి నువ్వు, ప్రభాకరావు అసలు ఏమి మార్పులేదురా. రత్నాజీ కూడా అలాగే ఉన్నాడు' ఇదీ ఒకనాటి నేస్తాల కుశల ప్రశ్నల సందడి. ప్రశాంత వాతావరణంలో అనంతపల్లి జెడ్పీ హైస్కూలు 1979–80 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమావేశం సమీపంలోని అచ్చన్నపాలెం కాకర్ల వారి ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. రావూరి శ్రీనివాస్ పూర్వ విద్యార్థులకు స్వాగతం పలికారు. పలు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యులు, కూతుళ్లు, అల్లుళ్లు, కొడుకులు, కోడళ్లు, మనవలు హాజరయ్యారు. ఉదయం 8 గంటల నుంచే కార్యక్రమం ప్రారంభమైంది. పూర్వ విద్యార్థులు వారు చేస్తున్న వృత్తి, వ్యాపారం, కుటుంబ వివరాలు తెల్పుకున్నారు. చిరునామాలు, సెల్‌నంబర్లు మార్చుకున్నారు. పాఠశాలలో చదివే రోజుల్లో ఆటపాటలు, ఉపాధ్యాయులతో అనుబంధం, స్నేహితులతో కలసి చేసిన అల్లరి పనులు నెమరువేసుకున్నారు. ఆటపాటలతో గడిపారు. విందు భోజనం చేసిన తర్వాత మిత్రులంతా గ్రూప్ ఫొటో దిగారు. మరోసారి కలుద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు. మధురమైన జ్ఞాపకాలను మదినిండా నింపుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమం రూపకర్త టీచర్ పద్మవాణిని సత్కరించారు. సత్యమోహన్, రామకృష్ణ, సత్యనారాయణ, రాజగోపాలరాజు, ఏడుకొండలు, సోమశేఖరం, పెండ్యాల రామకృష్ణ, సుశీల, కోట జగన్ పాల్గొన్నారు.

గురువును మించిన దైవం లేదు

ఉండ్రాజవరం: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము చదువులమ్మ చెట్టు నీడలో అంటూ పూర్వ విద్యార్థులు ఒకే చోట కలసి ఆనందం పంచుకున్నారు. మండలంలోని తాడిపర్రు ఉన్నత పాఠశాలకు చెందిన 2012–13 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తాడిపర్రు ఉన్నత పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో అప్పటి విద్యార్థులంతా కలసి ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు గురువులు అందించిన చదువే నేడు అందరం ఈ స్థాయికి వచ్చామని తెలిపారు. వారికి చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 12 ఏళ్ల తరువాత ఈ కార్యక్రమం జరగడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.